కొనను." ఆమె మొహం కణకణ మండే అగ్నివలె వుంది.

సాయంకాలం ఆరు గంటలైంది. 'రాజా' జాడ తెలియలేదు. కాలు కాలిన పిల్లిలా ఇంటిచుట్టూ ప్రదక్షిణం చేసింది. 'రాజా' ఇంకా రాలేదు. ఇక లాభం లేదని నగరంలో వున్న పత్రికలన్నిటికీ ప్రకటన పంపించింది. ఈ సారి బహుమతి నూటయాభై రూపాయలవరకు పెరిగింది.

నాలుగు రోజులు గడిచాయి. 'రాజా' రాలేదు. ఆమెకు ఇంకేమీ పాలుపోలేదు. డిటెక్టివ్ కోసం కబురు చేసింది. అతను వచ్చాడు. "నా చిన్ని కుక్కపిల్ల తప్పిపోయింది. నా 'రాజా' నన్ను ఒంటరిగా చేసి వెళ్లిపోయాడు. మీరు ఎలాగయినా పట్టుకోవాలి. మీ మేధస్సునంతా కరిగించి పరిశ్రమించి వెతకాలి. ప్రతి యిల్లూ సోదా చెయ్యండి. రేపు సాయంకాలానికి మీరు 'రాజా' ను అప్పగించినట్లయితే మూడువందల రూపాయలు బహుమతి. మీ ప్రతిభ నాకు తెలియదూ? నా 'రాజా' ను నాకు చూపించరూ?" ఆమె వెక్కి వెక్కి రోదించసాగింది.

డిటెక్టివ్ పదినిముషాల వరకూ మాట్లాడలేకపోయాడు.

"అమ్మా! అయితే కుక్కపిల్ల ఎప్పుడు తప్పిపోయిందో చెప్పగలరా?"

"మా ఆయన..."

"మీ కుక్కపిల్లసంగతి చెప్పండి ముందు."

"మా ఆయనా కుక్కపిల్లా వారంరోజులక్రితం ఒక సాయంకాలం షికారు వెళ్ళారు. ఇద్దరూ ఇంతవరకూ ఇల్లు చేరలేదు." ఆమె క్షణంసేపాగి "నా కుక్కపిల్లను నాకు చూపించరూ" అని మళ్ళీ సప్తమస్థాయిలో అందుకున్నది.

*నీతి*: పెళ్లిచేసుకొన్న రాజాకంటె చుట్టూ తిరిగే రాజా అంటే కొందరికి ఇష్టం.